వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



గౌతంనగర్: డివిజన్ ఓల్డ్ మిర్జాలగూడలోని వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం వేంకటేశ్వరస్వామి కల్యాణం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి హోమం, స్వామివారికి అభిషేకం అనంతరం కల్యాణోత్సవం, రథోత్సవం కార్యక్రమాలు చేపట్టారు. ఆంజనేయ సేవా భక్తబృందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కేటీఆర్‌తో పాండాల శివకుమార్‌గౌడ్

కుషాయిగూడ: బీఆర్‌ఎస్ సీనియర్ నేత పాండాల శివకుమార్‌గౌడ్ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ముందస్తుగా దసరా శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లిని దర్శించుకుని జూబ్లీహిల్స్‌లో బీఆర్‌ఎస్ పార్టీ విజయానికి తమ శాయశక్తుల కృషిచేస్తామని కేటీఆర్‌కు వివరించినట్లు చెప్పారు.

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు

రామంతాపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రామంతాపూర్ బాలకృష్ణనగర్‌లోని అమ్మవారి మండపంలో మంగళవారం అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. అమ్మవారి మండపంలో చిన్నారులకు దుర్గామాత ప్రతిమను చిత్రించే డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. నిర్వాహకులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనాశక్తి పెంపొందించడానికి డ్రాయింగ్ పోటీలు నిర్వహించామన్నారు.

లక్కీడ్రా చెక్కు అందజేత



అల్వాల్: సురేష్ సేవా సమితి ఆధ్వర్యంలో మచ్చబొల్లారం డివిజన్ సెలెక్ట్ టాకీస్ వద్ద బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ నేతలు నర్ల సురేష్ మహిళలకు ప్రోత్సాహక బహుమతులు, లక్కీడ్రాలో గెలుపొందిన మహిళకు రూ.5551 చెక్కును అందజేశారు.

సాయిబాబా 107వ ఆరాధనోత్సవాలు

గౌతంనగర్: డివిజన్ సాయినగర్‌లోని సాయిబాబా దేవాలయంలో మంగళవారం శ్రీసాయి సమాజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిబాబా 107వ మహాసమాధి, దసరా ఉత్సవాలు నిర్వహించారు. నాట్యాచార్య పసుమర్తి శేషుబాబు శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కళారంగం సేవ గొప్పది



డాక్టర్ తులసీరమణాచార్యులను సన్మానిస్తున్న దృశ్యం

మల్కాజిగిరి: కళారంగానికి సేవ చేయడం గొప్ప అవకాశమని త్రిశక్తి సేవా సమితి అధ్యక్షురాలు సూర్యకుమారి అన్నారు. అక్షర కౌముది సేవా సంస్థ వ్యవస్థాపకులు ఇటీవల డాక్టరేట్ పొందిన తులసీరమణాచార్యులను మంగళవారం ఆనంద్‌బాగ్ శంకర విద్యాపీఠం(కనకరాజుతోట)లో సన్మానించారు. సూర్యకుమారి మాట్లాడుతూ.. సాహిత్య, సాంఘిక, సేవా కార్యక్రమాల్లో అక్షర కౌముది సంస్థ తనవంతు పాత్ర పోషిస్తుందన్నారు. చిన్న పిల్లలకు సాంప్రదాయాలను తెలియజేయడం హర్షనీయమన్నారు. శేషుకుమార్, సమయ, రవికుమార్, జ్యోతి, సాయిబాబు, గాయత్రి, శశి, శర్మ, మాధవరావు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

అల్వాల్: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారం లక్ష్మమ్మ ఎన్‌క్లేవ్‌లో నివసించే ఉషారాణి (48) మంగళవారం సాయంత్రం రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. ఎదురుగా నడుచుకుంటూ వచ్చిన దుండగుడు ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గౌతంనగర్‌లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత



గుల్మోర్ గార్డెన్ ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి



చర్లపల్లిలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

దుర్గాదేవీ నమోస్తుతే !

దేవీశరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలో అమ్మవారు దుర్గాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం వివిధ మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.
– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



ఉత్తంనగర్‌లో దుర్గాదేవిగా అమ్మవారు



ఆది పరాశక్తి అవతారంలో మాతా నిమిషాంబదేవి



దుర్గాదేవి అలంకారంలో సరస్వతీదేవి



అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు



హెచ్‌బీకాలనీలో బీఆర్‌ఎస్ నేత జంపాల్‌రెడ్డి



హోమంలో పాల్గొన్న గూడురు శైలేష్‌రెడ్డి దంపతులు



ఇందిరానెహ్రూనగర్‌లో..



ప్రత్యేక పూజల్లో ఆలయ చైర్మన్ రమేష్‌యాదవ్

అమ్మవారిని ఆరాధిస్తే అన్నీ శుభాలే..

రామంతాపూర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లోని త్రిశక్తి నల్ల పోచమ్మ ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజలకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ సతీమణి జమున, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మహాభాగ్యనగర సేవా సమితి అధ్యక్షుడు మహాదేవ పట్ల లక్ష్మణ్ ప్రసాద్ శర్మ, ఆలయ చైర్మన్ గడ్డం సాయికిరణ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడి !

మేడిపల్లి: ఓ వ్యక్తిపై ఇనుపరాడ్‌తో దాడిచేసి, హత్యాయత్నానికి పాల్పడిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మండలం కాచవాని సింగారానికి చెందిన ఓ మహిళకు ఏదులాబాద్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహమైంది. భార్యకు మరో వ్యక్తితో సంబంధం ఉందని భర్త పలుమార్లు కుల పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టడంతో పెద్దలు ఇరువురికి నచ్చజెప్పారు. కొద్ది రోజులుగా ఆమె పుట్టింట్లో ఉంటోంది. పెద్దలు చెప్పినా ఇరువురిలో ఎలాంటి మార్పు రాకపోవడంతో పాటు వివాహేతర సంబంధానికి కారణమైన జంగయ్య అనే వ్యక్తిపై సదరు మహిళ భర్త కక్ష పెంచుకుని ఎలాగైనా అతడిని హతమార్చాలని పథకం వేశాడు. మంగళవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై మేడిపల్లి వైపు వస్తుండగా.. పర్వతాపూర్ సమీపంలోకి రాగానే వెనకాల కారుతో ద్విచక్రవాహనాన్ని శ్రీనివాస్ ఢీ కొట్టాడు. దీంతో జంగయ్య కిందపడటంతోనే కారులోంచి దిగిన అతడు తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో దాడి చేశాడు. తీవ్రగాయాలైన జంగయ్య మృతిచెందాడని నిందిదుతు తన కారులో ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ దాడికి సంబంధించి బాధితుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

గుంతలు.. చింతలు !

అల్వాల్: ఇందిరాగాంధీ విగ్రహం వద్ద, వీబీఆర్ గార్డెన్ నుంచి సిటిజన్ కాలనీ వరకు, అల్వాల్ హిల్స్, పంచశీల హైటెన్షన్ రోడ్డులో గుంతలమయమైన రోడ్లతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ దారిన వెళ్లే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా తాత్కాలిక మరమ్మత్తులు చేపట్టి సరిపెట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని బీజేపీ నేతలు శ్రీనివాస్‌వర్మ, కాలనీవాసులు కోరుతున్నారు. అల్వాల్‌హిల్స్‌లో కనీస రోడ్డు సౌకర్యం, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కోరారు.



పంచశీల హైటెన్షన్ రోడ్డు

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం

జవహర్‌నగర్: విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. 153వ సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నీలం రామచంద్రయ్యభవన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జీ అనురాధ, డివిజన్ కార్యదర్శి శివబాబు ఆధ్వర్యంలో మంగళవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమన్నారు. మూఢ నమ్మకాలను పాలదోలి ఆధునికతవైపు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. బీజేపీ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. కుల దురహంకార హత్యలకు, కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడదామన్నారు. పూలే దంపతులు స్థాపించిన సత్యశోధక సమాజ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో శివప్రసాద్, యాదన్న, రాంరెడ్డి, మణెమ్మ, దులప్ప, యాదమ్మ, రాములు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా అధికారుల పర్యటన

పోచారం: జోడిమెట్ల చౌరస్తాలో నెలకొన్న నాలా సమస్యను మంగళవారం హైడ్రా సీఐ సైదులు పరిశీలించారు. నాలా సమస్యను పరిష్కరించాలని మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఇటీవల హైడ్రా అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. అనంతరం సీఐ సైదులు మాట్లాడుతూ.. నాలాపై ఉన్న ఆక్రమణలను తొలగిస్తే వరద నీరు రోడ్డుపై నిలవకుండా సాఫీగా పోతుందన్నారు. కబ్జాలను తొలగించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

రణదేవ్‌కు అభినందన



అభినందిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కుషాయిగూడ: గ్రూప్–2లో లా ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించిన ఎంపల్లి క్రాంతి రణదేవ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రెడ్డితో పాటు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. నేమూరి మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం మాజీ ఎండీపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్: రైతు సేవా సహకార సంఘంలో అవినీతికి పాల్పడిన మాజీ ఎండీపై చర్యలు తీసుకోవాలని రైతు రుణమాఫీ సాధన సమితి సభ్యులు అన్నారు. ఈ మేరకు మంగళవారం కోఠి లోని రీజినల్ ఆఫీస్‌లో యూనియన్ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. రుణమాఫీ జాబితా తప్పుగా ఉన్నందుకే రుణ మాఫీ కాలేదని, తన అవినీతి బయట పడుతుందని రైతుల తుది జాబితాను ఎండీ పంపలేదని లేఖలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

అల్వాల్: నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు మంజూరు చేసేందుకు తాను ముమ్మరంగా కృషి చేస్తానన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లోని శివనగర్, గణేష్‌నగర్‌ల మధ్య నూతన డ్రైనేజీ పైపులైన్లు వెయ్యాలని, కౌకూర్ గృహకల్పనలో మౌలిక వసతుల కల్పన, తాగునీటి అలోకేషన్, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జలమండలి జీఎం సునీల్, డీజీఎం సాంబయ్య, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

ఆకట్టుకున్న చేనేత వస్త్ర ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో దసర ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసి ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా మంగళగిరి చీరలు, చేనేత వస్త్రాలు, బెడ్‌షీట్లు, పోచంపల్లి, గుజరాత్ బందీని, బీహార్ బగల్పూరీ, సోలాపూర్ హ్యాండ్లూమ్ వస్త్రాలు ఆకట్టుకుంటున్నాయి.



అలరించిన చత్తీస్‌ఘడ్ జానపద నృత్యం

ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చత్తీస్‌ఘడ్ జానపద నృత్యం అహుతులను కట్టిపడేసింది. సౌత్‌జోన్ కల్చరల్ సెంటర్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన కామరానృత్యం, మధ్యప్రదేశ్ ప్రాంతానికి చెందిన గుడుంబాజా నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణలుగా నిలిచాయి.



రెడ్డికాలనీలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ శ్రీదేవి



మేడిపల్లి సద్దుల బతుకమ్మ ఉత్సవాల్లో మాజీ కార్పొరేటర్ హరిశంకర్‌రెడ్డి



మల్లాపూర్ నాగలక్ష్మినగర్‌లో..



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల పరిధిలో బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం మహిళలు ఇళ్ల ముందు, ఆలయాల ఆవరణ, వీధుల్లో అందరితో కలిసి బతుకమ్మ ఆడి ఉత్సాహాన్ని నింపారు. బతుకమ్మ పాటలతో వీధులన్నీ కిక్కిరిసిపోయాయి. మహిళల సంప్రదాయ వస్త్రాలంకరణ ఆకట్టుకుంది.
– ఉప్పల్, మల్కాజిగిరి జోన్ల బృందం



ఉప్పల్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో



కోదండ రామాలయం వద్ద..



బోడుప్పల్ ఆర్టీసీ కాలనీ ఫేజ్-2లో..



ఓల్డ్ సఫిల్‌గూడ ద్వారకామయికాలనీలో..



వెంకటాపురం గొల్లగూడ కమాన్ వద్ద బీజేపీ మహిళా నేతలు



కేఎల్‌రెడ్డినగర్‌లో బతుకమ్మలతో మహిళలు